## క్లుప్తంగా

### నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ వేమూరి మానస ఆదివారం తెలిపారు. ప్రజలు ఆయా సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ కోరారు.

### మృతుని కుటుంబానికి పరామర్శ



జగ్గయ్యపేట అర్బన్: ఐర్లాండ్ దేశంలో కారు ప్రమాదానికి గురై మృతి చెందిన గండ్రాయి గ్రామానికి చెందిన చిట్టూరి భార్గవ్ కుటుంబసభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. పేటలో నివసిస్తున్న భార్గవ్ నివాసానికి వెళ్లిన తన్నీరు నాగేశ్వరరావు మృతుడి తండ్రి సాయిబాబా, కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో ఆపార్టీ నాయకులు నంబూరి రవి, కన్నెమాల శామ్యూల్, పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### ఆ 'పూర్వ' విద్యార్థుల కలయిక



మోగులూరు(కంచికచర్ల): మండలంలోని మోగులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986–87లో పదోతరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై ఆనందోత్సాహాలతో గడిపారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, పాఠశాలలో చదువుకున్నప్పటి సంగతులను జ్ఞప్తి చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండి మల్లికార్జునరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, వెలగా సాంబశివరావు, రజిని, శారద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బోల్తా–ముగ్గురికి తీవ్రగాయాలు



గౌరవరం(జగ్గయ్యపేట): ఓ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన గౌరవరం సమీపంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే జగ్గయ్యపేట పట్టణంలోని మిట్టగూడెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తాళ్లూరి నరసింహారావు కూలీలతో కలిసి గ్రామంలోని బ్రిక్స్ కంపెనీకి వెళ్తుండగా జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న మహిళ బత్తుల శ్రావణి, గుంజా కార్తీక్‌లతో పాటు డ్రైవర్ నరసింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని108 ద్వారా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కార్తీక్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అతన్ని విజయవాడ తరలించారు.

### ఆకట్టుకున్న సంగీత, నృత్య ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: జేఎమ్ఎస్ నాట్యవేద (అకాడమీ ఆఫ్ డాన్స్ అండ్ మ్యూజిక్ ) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి ఆధ్వర్యంలో చిన్నారులు అన్నమయ్య పదాలు, త్యాగరాజ స్వామి, రామదాసు కీర్తనలు మధురంగా ఆలపించారు. 80 మంది చిన్నారులు పలు సంప్రదాయ కీర్తనలకు నృత్యాలను అభినయించారు. సంగీత విద్వాంసుడు డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి మాట్లాడుతూ సంగీతం భగవదత్తమైన వరమని దానిని భగవత్ సేవగా భావంచాలని కోరారు. అన్నమయ్య, త్యాగరాజ స్వామి లాంటి వాగ్గేయ కారుల కీర్తనలలో తెలుగు భాష, నుడికారం కనిపిస్తుందన్నారు. జేఎమ్ఎస్ నాట్యవేద వ్యవస్థాపకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఫైర్ ఇంజిన్ ఏర్పాటు చేయరూ..

- ప్రమాదాలను తలుచుకుంటున్న వైనం...
- మండలానికి ఫైర్ ఇంజిన్ అవసరమంటున్న ప్రజలు..
- నిత్య యాత్రాస్థలంగా గుర్తించాలంటున్న గ్రామస్తులు



2018లో శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద మునేరులో కాలిపోయిన పాకలు(ఫైల్)

పెనుగంచిప్రోలు: నిత్య యాత్రాస్థలంగా పేరొందిన మండలకేంద్రం పెనుగంచిప్రోలులో ఫైర్ ఇంజిన్ సదుపాయం లేకపోవడంతో ప్రమాదసమయాల్లో తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతోంది. అగ్నిప్రమాదాల సమయంలో సుమారు 17కిలోమీటర్ల దూరంలో ఉన్న జగ్గయ్యపేట నుంచి ఫైరింజన్ వచ్చేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోందని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**రెండేళ్ల కిందట భారీనష్టం..**

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట పట్టణం, మండలం, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు కలిపి జగ్గయ్యపేటలో ఓ ఫైర్ ఇంజిన్ మాత్రమే ఉంది. ముఖ్యంగా నిత్యయాత్రా స్థలమైన పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారికి పొంగళ్లు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. గ్యాస్ , కట్టెల పొయ్యిలపై పొంగళ్లు చేస్తుంటారు. 2023 జనవరిలో పెద్ద తిరునాళ్ల సమయంలో రాత్రి వేళ ఆలయం వద్ద అగ్నిప్రమాదం చోటుచేసుకుని 19 దుకాణాలు కాలి బుడిదయ్యాయి. సుమారుగా రూ.60 లక్షల నష్టం వాటిల్లింది. 2018 మార్చి4న శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల సమయంలో మునేరులో పాకలు వేసుకుని చిరువ్యాపారాలు నిర్వహించుకునేవారి ఓపాకలో గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు 50 దుకాణాలకు విస్తరించి అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటనలో సుమారు రూ.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. అయితే ఈరెండు ప్రమాదాల్లో ప్రాణనష్టం లేకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీటికి తోడు ఆలయం వద్ద గతంలో కూడా రెండు మూడు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న వైనాన్ని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు.

ప్రస్తుతం కేవలం పెద్ద తిరునాళ్ల, చిన్న తిరునాళ్ల సమయంలో మాత్రమే అగ్నిమాపకశాఖ అధికారులు ఓ ఐదు రోజులపాటు ఫైరింజిన్‌ను ఆలయం వద్ద ఉంచుతుండగా, మిగిలిన సమయంలో ప్రమాదం చోటుచేసుకుంటే పరిస్థితి ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు..**

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు కూడా సరైన అవగాహన లేకపోవడం కూడా ప్రమాదాల తీవ్రతకు కారణమౌతోంది. ఆలయం వద్ద ఆయా దుకాణాల యజమానుల్లో కొందరు నిబంధనలు అతిక్రమించి గ్యాస్ పొయ్యిలు ఏర్పాటు చేసుకోవడం, విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలతు పాటించకపోతుండటం, దుకాణానికి అదనగంగా షెడ్లు ఏర్పాటు చేసి పట్టాలు కట్టడం తదితర అంశాలు కూడా అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇకనైనా పాలకులు స్పందించి పెనుగంచిప్రోలు మండలంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



2023లో ఆలయం వద్ద కాలిపోతున్న దుకాణాలు(ఫైల్)

# 5న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు



పేటలో ఫీజు పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 5వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ ఫీజు పోరు నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఫీజు పోరు పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఫీజుపోరులో పాల్గొని కూటమి ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనాలోచిత విధానాల కారణంగా విద్యా వ్యవస్థ కుంటుపడి విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారిందన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంటు, మెస్‌చార్జీల అందక పేద విద్యార్థులు తీవ్ర అవస్థలుపడుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ఫీజు పోరు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఫీజుపోరుకు అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్లు పింగళి నర్సింహరెడ్డి, మన్నె అప్పారావు, పార్టీ సీనియర్ నాయకులు శామ్యూల్ కన్నమాల, లాహోరి బద్దూనాయక్, నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, ఎం.జగదీష్, దివ్వెల రామారావు, రామిని ఉపేందర్‌రెడ్డి, గోగుల వెంకయ్య, గంగోలు వినోద్ కుమార్, గొట్టిపాళ్ల సురేష్, కె.బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సందిగ్ధంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- విప్ జారీ చేసిన వైఎస్సార్ సీపీ
- చైర్మన్ ఎన్నిక వ్యవహారంపై ఉత్కంఠ



నందిగామటౌన్: నందిగామ పురపాలక సంఘం చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పురపాలక సంఘంలో 20 వార్డులుండగా 13వార్డులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఆరు వార్డులను టీడీపీ, ఒక వార్డును జనసేన పార్టీ గెలుచుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మండవ వరలక్ష్మి చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసింది. ఆ తరువాత అనారోగ్య కారణాలతో ఆమె మృతి చెందగా ఆ సమయంలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఏడోవార్డు కౌన్సిల్ సభ్యురాలు మాడుగుల నాగరత్నంను ఇనచార్జ్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఆమె కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి 15వ వార్డు కౌన్సిల్ సభ్యురాలు ఓర్సు లక్ష్మీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆ తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో తంగిరాల సౌమ్య ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా ఎన్నికయ్యారు. ఈక్రమంలో అరుగురు కౌన్సిల్ సభ్యులు అనైతికంగా టీడీపీలో చేరారు. అయితే ఇద్దరు కౌన్సిల్ సభ్యులు మృతిచెంది ఉండగా ఆ రెండు వార్డులకు ఎన్నిక నిర్వహించి ఆతరువాతే చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని కోరుతూ ఇద్దరు మహిళలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈ పిటీషన్‌ను న్యాయమూర్తి సోమవారానికి వాయిదా వేశారు. దీంతో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందా? లేదా?అనే సందిగ్ధత నెలకొంది. అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిన అభ్యర్థినే పార్టీ కౌన్సిల్ సభ్యులు ఎన్నుకోవాలని కోరుతూ ఆ పార్టీ విప్ జారీ చేసింది. కోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ విప్ జారీ చేయడంతో చైర్మన్‌గిరిని టీడీపీ కైవసం చేసుకున్నా, ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నిక చెల్లదని పలువురు న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. దీంతో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వ్యవహారంపై సందిగ్ధత నెలకొంది.

### క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి



జగ్గయ్యపేట అర్బన్: దలు శారీరక, మానసిన దారుఢ్యానికి దోహదపడటమే కాకుండా ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి ఒత్తిడిని దూరం చేస్తాయని పులిచింతల ప్రాజెక్టు జెన్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజిజాతీయ వెటరన్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు రమేష్ పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీలలో విజేతగా నిలిచిన రమేష్‌ను స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సభ్యులు, క్రీడాకారులు రామమూర్తి, ప్రసాద్, నాగరాజు, నరసింహరాజు, షమీర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాల్వ ఇలా..నీరు ముందుకు కదిలేదెలా?



ఏడు అడుగుల మేర పెరిగిన పిచ్చిమొక్కలు

- పిచ్చిమొక్కలు, తూటుకాడతో నిండిన ఎర్ర కాల్వ
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖాధికారులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): మండలంలోని షేర్‌మహ్మద్‌పేట నుంచి రామచంద్రునిపేటకు వెళ్లే రోడ్డులో ఉన్న కాచవరం కాల్వ పరిధిలోని ఎర్రకాలువలో పిచ్చిమొక్కలు, తూటుకాడ పెరిగిపోయింది. కాల్వ కింద రైతులు మొక్కజొన్న, కాయగూరలు, మిర్చి పంటలను వందల ఎకరాలలో సాగు భూమి ఉంది. కాల్వ అధ్వానంగా ఉండటంతో సాగునీరు ఎలా ముందుకు సాగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కాల్వ ఆక్రమణలకు గురవుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖాధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, తూటు కాడ తొలగించడంతోపాటు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాల్వలో దట్టంగా పెరిగిన తూటుకాడ

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ జిల్లా గవర్నర్ శేషగిరి, స్థానిక క్లబ్ ప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ ఆవరణలో స్మైలీ హాస్పిటల్ వైద్య బృందంచే ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయగా, వైద్యులు అవినాష్, లక్ష్మి, రామారావు, స్వరాజ్య పాల్గొని సుమారు 150మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శేషగిరి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బదరీనారాయణ, సెక్రటరీ బండారు రవికుమార్, ట్రెజరర్ కరుణాకర్, జోన్ చైర్మన్ రాజాకేశవప్రసాద్, ఇతర క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అగర్వాల్ ఐ హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణులు ఎస్.కోమల్, డి.శ్రీను 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఈవైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఆనందసాయి ఆలయం వద్ద పేదలకు అన్నదానం ఏశారు. అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో లయన్స్ క్లబ్ భవనానికి శంఖుస్థాపన చేశారు. ఇండోర్ స్టేడియం వద్ద లయన్స్ క్లబ్ కమ్యూనిటీ భవన్‌లో లయన్స్ సమావేశం నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

### ఘాట్‌రోడ్డులో ఎగిసిపడిన మంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్ రోడ్డులోని మొదటి మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున మంటలు ఎగిసిపడ్డాయి. ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపువద్ద ఇటీవల రిటైనింగ్ వాల్ నిర్మించారు. రిటైనింగ్ పక్కనే ఉన్న స్థలంలో చెత్త పేరుకుయింది. ఈక్రమంలో ఆదివారం ఒకసారిగా ఆప్రాంతంలో మంటలు ఎగిసి పడి మైక్ వైర్లు, సీసీ కెమెరా వైర్లు దగ్ధమయ్యాయి. చెత్తలో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# జానపద కళాకారులకు సత్కారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇతిహాస పురాణ కాలం నాటి జనం నుంచి ఉద్భవించిందే జనపదమని, కాలక్రమంలో అదే జానపదమైందని ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీతశిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్ రావు పేర్కొన్నారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల బొండా ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆయన జానపద కళాకారులు దామోదర గణపతిరావు, ఉత్తరాంధ్రకు చెందిన వావిలపల్లి మోహనరావు, మంతెన సుశీల, మీసాల రమణ, పి.మన్మధరావు, కళాసేవకులు ముత్తంశెట్టి దుర్గా కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ జానపద కళారూపల ద్వారా సమాజాన్ని జాగృతం చేస్తున్న కళాకారులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో నరహరిశెట్టి శ్రీహరి, రామినేని వెంకటేశ్వరరావు, బొండా లక్ష్మీకుమారి, అల్లం పూర్ణచంద్రరావు, పీవీ నాగరాజు, మార్తాండ కుమార్, న్యాయవాది వివేకానంద మూర్తి, విజయసాయి తదితరులు పాల్గొన్నారు.

### స్థలం విక్రయిస్తామంటూ మోసం చేసిన వారిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థలం విక్రయిస్తామని చెప్పి ఓ వ్యక్తిని నమ్మించి మోసం చేసిన ఘటనపై భవానిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...వన్‌టౌన్ గొల్లపాలెంగట్టుకు చెందిన కనిశెట్టి లక్ష్మణరావు మరుపిళ్ల విజయలక్ష్మి పేరిట మైలవరం మండలం గణపవరంలో ఉన్న స్థలం కొనుగోలు చేసేందుకు 2022 జూలైలో ఒప్పందం చేసుకున్నాడు. ఆ సమయంలో లక్ష్మణరావు ఆమెకు రూ.5లక్షలు చెల్లించాడు. భూమి సర్వే నంబర్ బ్లాక్‌లో ఉన్నందున ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే సర్వే నంబరు బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించినప్పటికీ ఆస్థలాన్ని లక్ష్మణరావుకు రిజిస్ట్రేషన్ చేయకుండా మరుపిళ్ల విజయలక్ష్మి, ఆమె భర్త రవికుమార్ అదిగోఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. రవికుమార్ షాపులో పనిచేస్తున్న వీఎస్ మణికుమార్ ద్వారా లక్ష్మణరావుకు నగదు తిరిగి ఇచ్చినట్లు నకిలీపత్రాలు సృష్టించారు. ఈక్రమంలో తనకు స్థలం రిజిస్ట్రేషన్ చేయకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా విజయలక్ష్మి, ఆమెభర్త రవికుమార్ తనను మోసం చేశారంటూ లక్ష్మణరావు భవానీపురం పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### 150 మందికి కంటి పరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్:భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సత్యసాయి ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభించారు. పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రి వైద్యబృందం పాల్గొని 150 మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని సేవా సమితి ప్రతినిధి చిట్టూరి కొండ తెలిపారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న అమ్మవారి ఆలయం

గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

– పెనుగంచిప్రోలు

